

రొట్టెల పండుగకు పటిష్ట ఏర్పాట్లు :మేయర్

ప్రజాశక్తి-నెల్లూరు: బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ నిర్వహణకు పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని కార్పొరేషన్ అధికారులను మేయర్ స్రవంతి జయవర్ధన్ సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్లో ఈ నెల 29 నుండి ప్రారంభం కానున్న రొట్టెల పండుగ ఏర్పాట్లకు సంబంధించి నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో వర్షం కురుస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా షామియానాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, వి.ఐ.పి రిసెప్షన్, సి.సి కెమెరాలు, విద్యుత్ లైటింగ్, పారిశుద్ధ్యం, స్త్రీలకు మరుగుదొడ్లు, పార్కింగ్, మహిళలకు రక్షణ, బారికేడ్ల నిర్మాణం, పోలీసుల పర్యవేక్షణ, స్వర్ణాల చెరువు తీరం వెంబడి భద్రతా చర్యలు వంటి వివిధ అంశాలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శానిటరీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న మేయర్ పి స్రవంతి

నెల్లూరులో కీలక రాజకీయ పరిణామాలు..!

○టిడిపి ఇన్‌ఛార్జ్‌గా ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
○సిఎంతో వైసిపి నేత రూప్‌కుమార్ యాదవ్ భేటీ
○చెన్నయ్ అపోలోలో అబ్దుల్ అజీజ్



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు నగరంలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. వైసిపి నుంచి బయటకొచ్చిన ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. నెల్లూరు నగర వైసిపిలో నువ్వా..నేనా అన్నట్లు ఉన్న పరిస్థితుల్లో వైసిపి నేత పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అనార్యోగంతో చెన్నయ్ అపోలో ఆసుపత్రిలో చేరారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గంలో ఒకే సారి కీలకమైన రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన రూప్‌కుమార్ యాదవ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ వైసిపి బహిష్కర నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారికంగా టిడిపి తమ చెంతన చేర్చుకుంది. అధికారికంగా ఆయన పార్టీలో చేరకపోయినా ఇటీవల నారా లోకేష్ యువగళంను తన నియోజకవర్గంలో నిర్వహించారు. సాంకేతిక సమస్యలు వస్తాయని, తరువాత టిడిపిలో చేరుతానని ఆయన ప్రకటిస్తూవచ్చారు. మంగళవారం టిడిపి నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ, రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చంనాయుడు ఉత్తర్వులిచ్చారు. అధికారికంగా ఆయన టిడిపి నేతగా కొనసాగాల్సి ఉంటుంది. కొద్దిరోజులుగా టిడిపి నేతలు, కార్యకర్తలు, కోటంరెడ్డి శ్రీధర్‌తో నువ్వా..నేనా అన్నట్లు ఉండేది. ఇటీవల శ్రీధర్‌రెడ్డి నెల్లూరు రూరల్ నేతలందరికీ కలిసి తమవైపు తిప్పుకున్నారు. టిడిపి విజయానికి కృషిచేస్తానమని ప్రకటించారు. ఇప్పుడు అందరూ టిడిపి నేతలు ఎంఎల్‌ఎ కార్యాలయంలోనే ఉంటున్నారు. ఎన్నికలకు సమయం లేకపోవడంతో శ్రీధర్‌రెడ్డికి అధికారంగా టిడిపి బాధ్యతలు అప్పగించింది. పార్టీ బాధ్యతలు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టిడిపి నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న అబ్దుల్ అజీజ్‌ను పార్టీ జిల్లా అధ్యక్షులుగా కొనసాగిస్తున్నారు. అజీజ్‌కు కిడ్నీ సంబందింత సమస్యతో చెన్నయ్ అపోలో ఆసుపత్రిలో స్టంట్ వేశారు. గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత ఇబ్బందులతో ఉన్నారు. కార్యాలయానికి అడపా, దడపా వస్తున్నారు. వైసిపి నేతలు కొందరు అజీజ్ తమ పార్టీలో చేరుతారని ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే అజీజ్‌తో నడిచిన నేతలు, కార్యకర్తలంతా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి దగ్గరయ్యారు. నెల్లూరు రూరల్‌లో టిడిపి విజయానికి కృషిచేస్తామని ప్రకటించారు. నెల్లూరు సిటి వైసిపిలో కొద్ది రోజులు ఎంఎల్‌ఎ అనిల్‌కు మార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మధ్య నువ్వా..నేనా అన్నట్లు ఉంది పరిస్థితి. నెల్లూరు సిటీలో అనిల్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఏకమవుతున్నారు. పరిస్థితులు బాగా లేకపోయినా అనిల్ కుమార్ యాదవ్ స్వపక్షం, ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేస్తూ మాట్లాడుతు న్నారు. ఇటీవల వెంకటగిరి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూప్‌కుమార్‌యాదవ్‌తో మాట్లాడారు. అనిల్‌ను గెలిపించుకు తీసుకురావాలని చెప్పినట్లు తెలిసింది. సిఎం పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. "మనం అధికారంలోకి వస్తున్నాం, పార్టీ విజయానికి కృషి చేయండి. మీ భవిష్యత్తు నేను చూసుకుంటా" అంటూ హామీ ఇచ్చినట్లు తెలిసింది. సిఎంను రూప్ కలవడంతో అనిల్ గ్రూప్ నేతల ఆరా తీస్తు న్నారు. నెల్లూరు రూరల్, సిటీలో మంగళ వారం ఆసక్తికర రాజకీయాలు చోటు చేసు కున్నాయి. మంగళవారం జిల్లాలోని ముఖ్యనేతలతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కలిశారు. ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి సిఎంను కలిశారు.

చెన్నయ్‌లో చికిత్స పొందుతోన్న అబ్దుల్ అజీజ్

లోతట్టు ప్రాంతాల్లో పరిశీలన

నెల్లూరు నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజా జీవనానికి అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలవకుండా నివారించేందుకు తక్షణమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన డ్రైను మార్గాలు, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, మాగుంట లే అవుట్, విజయ మహల్ గేట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జ్ లు, పంపింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితిని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సంపత్ కుమార్, చంద్రయ్య, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

నెల్లూరు: స్థానిక 36/3 ఫతేఖాన్ పేట, 37/2 రామ్ నగర్ -2 వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాల యాలలోని ఇన్స్పెక్షన్ రిజిస్టర్, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టర్, స్పందన రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు.

వాచ్‌మెన్ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు: నెల్లూరులోని ప్రధాన రైల్వే స్టేషన్ లో వాచ్ మెన్ దారుణ హత్యకు గురయ్యాడు. రైల్వే స్టేషన్ తూరుపు బిట్రగుంట వైపు వాచ్ మెన్ విధులు నిర్వహించే సుబ్రమణ్యం రైల్వే స్టేషన్ సమీపంలో చనిపోయి ఉండగా కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మతదేహాన్ని పరిశీలించగా తలకు తీవ్రమైన గాయాలు ఉన్నాయి. దీంతో అది హత్యగా నిర్ధారించారు. రైల్వే స్టేషన్ వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా ప్రయాణికులతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఆర్‌పిఎఫ్ సిబ్బంది ఈ ప్రాంతంలో తిరుగుతున్నప్పటికీ ఈ హత్య ఘటన చోటు చేసుకోవడం పలు విమర్శలకు దారి తీస్తుంది. రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాల్లో రాత్రి పూట గంజాయి మత్తులో జులాయిలు తిరుగుతుంటారు. ఈ క్రమంలో ఎవరైనా వాచ్ మెన్ తో ఘర్షణ పడి హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మణిపూర్ సంఘటన హేయం

భారీ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మణిపూర్‌లో క్రైస్తవ సోదరులపై జరిగిన సంఘటన హేయమైనదని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో క్రిస్టియన్లతో కలిసి నిరసన తెలిపారు. కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మణిపూర్ క్రిస్టియన్ చర్చీలు, క్రిస్టియన్ మిషనరీ ఆస్తుల ధ్వంసం, అమాయక మహిళలపై అత్యాచారాలు చేయడం ఈ సంఘటన అత్యంత బాధాకరం, అవమానకరమన్నారు. కులాలు మతాలు వేరైనా మనమంతా భారతీయులం. భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న ప్రాంతాలు ఉన్న భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా అందరం ఒకే కుటుంబంలాగా ముందుకు సాగే పరిస్థితి అన్నారు.ఇలాంటి సంఘటనలు కులాలు, మతాల పేరుతో జరగడం దురదష్టకరమన్నారు. భారత ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. వేలాదిమంది సైన్యాన్ని, అస్సాం రైఫల్స్‌ని మణిపూర్‌కి పంపించిందన్నారు.మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలు రాజకీయ ప్రయోజనాలకోసం వాడకుండా, మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేదానికి ఏ చర్యలు చేపట్టాలో వాటిని నెలకొల్పేందుకు ప్రయత్నించాలన్నారు.

మణిపూర్ సంఘటనపై కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ధర్నాను జయప్రదం చేయండి : భ.ని.కా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా భవననిర్మాణ కార్మికుల సమస్యలపై జరిగే ధర్నాని జయప్రదం చేయమని భవన నిర్మాణ నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా భవన నిర్మాణ నగర కార్యదర్శి కాయం శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, సిఐటియు నగర కార్యదర్శి గజ్జ నాగేశ్వరరావు, మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన టువంటి జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని, వాటిని ఎక్కడా అమలు పరచలేదన్నారు. నాలుగేళ్ల కాలం కావస్తున్నా భవన నిర్మాణ కార్మికులకు రావా ల్సినటువంటి బకాయిలు ఇన్సూరెన్స్ అనేకం పెం డింగ్లో ఉండి పోయాయన్నారు. వాటిపై అనేకసార్లు పోరాటం చేసిన ఫలితం లేదన్నారు. ఆగస్టు 7వ తేదీ జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. జయప్రదం చేయాలన్నారు. ఎస్ఆర్ బిల్డర్ అధినేత సుధాకర్, అధ్యక్షుడు ఆవుల పెంచలయ్య, పుట్టా శ్రీనివాసులు రెడ్డి,పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

నెల్లూరు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నగరంలో ఒక 132 కె.వి.విద్యుత్ ఉపకేంద్రం అవసరం గుర్తించామని, ఆమేరకు అంచనాలు సిద్ధం చేసి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌కు పంపించాలని జిల్లా అధి కారులను ఆదేశించామని ఎపిఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ట్రాన్స్కో డైరెక్టర్ భాస్కర్ గారు, డిస్కాం డైరెక్టర్లు సుబ్బరాజు , శివప్రసాద్ రెడ్డి ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య , ధర్మ జ్ఞాని , ట్రాన్స్ కో చీఫ్ ఇంజనీర్ శ్యాం ప్రసాద్, , ఎస్.ఈ. బి.వెంకట సుబ్బయ్య ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : నెల్లూరు జిల్లా ఉప రవాణా కమిషనరు బి. చందర్ ఆదేశాల మేరకు కందు కూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కె ఎమ్‌డి రఫీ ఆధ్వర్యంలో కందు కూరు పట్టణంలోని టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రహదారి భద్రతపై అవగాహనా సదస్సు జరిగింది. ఎం వి ఐ ఎస్ కె. యండి రఫీ విద్యార్థిని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి తెలుసుకోవాలన్నారు. అందుకోసం రహదారి భద్రత అవ గాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, వాహన దారులతే షీట్ బెల్ట్ ధరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వర రావు మాట్లాడుతూ వాహనాలను అధిక వేగముతో నడపకూడదన్నారు. విద్యార్థులందరూ ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ప్రజాశక్తి-కందుకూరు : నేడు ఉదయం 8:30 గం. నుంచి 12:30 వరకు కందుకూరు మున్సి పాలిటీలోని వెంకటాద్రిపాలెం ఫీడర్‌లో చెట్ల తొలగింపు సందర్భంగా విద్యుత్ సర ఫరా నిలిపి వేయబడుతుంని టౌన్ ఎఇఇ టివి నరసింహం తెలిపారు. ఆ ఫీడర్ కింద ఉన్నటువంటి తానికొండ వారి కొష్టాలు, మధుర నగర్, వెంకటాద్రి పాలెం, వ్యవసాయ మార్కెట్, కందుకూరు కోర్టు, కనిగిరి రోడ్ సామిల్స్, బిలాల్ నగర్, దుబ గుంట, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంతాలలోని విని యోగదారులు సహకరించాలని కోరారు.

జాషువాకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : మహా కవి కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నివాళి అర్పించారు. స్థానిక కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలోని బుద్ధి అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభలో జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిషోర్ మాట్లాడారు. జాషువా తన సాహిత్యం ద్వారా సమాజంలోని అసమానతలను వివక్షతను రూపుమాపేందుకు కషి చేశారు. దండోరా దాసు మాట్లాడారు. జనార్ధన స్వామి దేవాలయం చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఉపాసక గాండ్లహరిప్రసాద్ , సిపిఐ కార్యదర్శి బూసి సురేష్ ,బి.యస్.పి కన్వీనర్ బెజవాడ కొండయ్య, వైయస్సార్ సీనియర్ నాయకుడు గళ్ళా.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దాసరి మల్లిఖార్జున, గుడిపూడివెంకట్రావు, చనమాల కోటేశ్వరరావు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు

ఉలవపాడు :మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులకు మంగళవారం కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఉలవపాడు, భీమవరం ప్రభుత్వ పాఠ శాలలో మండల విద్యాశాఖ అధికారి ప్రసాదరావు పాల్గొని మాట్లాడారు. పాఠ్యాంశాలను బోధించేటప్పుడు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాఠాలను ప్లాన్ దగ్గర ఉంచుకొని పాఠాలు బోధించాలని పేర్కొన్నారు. చాకిచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో ఎంఇఒ 2 రమణయ్య పాల్గొని మాట్లాడారు పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న జాబ్ మేళా

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూర్ బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వివేక డిగ్రీ కాలేజ్‌లో ఈనెల 27 గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. బిటిఎస్ చెన్నై వాళ్ల ఆధ్వర్యంలో ప్రముఖ కంపెనీలైన టెక్ మహేంద్ర, టాటా గ్రూప్ మొదలగు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

ఏజెంట్లకు 'ఇంటూరి' సూచనలు

ఉలవపాడు :ఉలవపాడు పంచాయతీ టిడిపి బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం మంగళవారం జరిగింది. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగే నెల రోజులపాటు ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో బిఎల్ఒలతో పాటు ఫీల్డ్ వెరిఫికేషన్ లో పాల్గొని కొత్త ఓట్లు చేరిక, చనిపోయిన ఓట్లు తీసివేయుంచుట, డోర్ నెంబర్ తప్పు ఉన్న ఓట్లు కు వారి యొక్క ఒరిజినల్ డోర్ నెంబర్ వచ్చేలా చూడుట, డబుల్ ఎంట్రీలు తొలగించేలా చూడాలన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు అంచుపోగు వాసు, క్లస్టర్ ఇంచార్జ్ బెల్లం కష్ణమోహన్, యూనిట్ ఇన్చార్జిలు గిరిబాబు, శివ మరియు బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు ఉన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణ పనులు వేగవంతం

నెల్లూరు:జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించుకుని, నిర్మాణ పనుల్లో వారిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని హౌసింగ్ విభాగం అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వరపురం లే అవుట్ ప్రాంతంలోని జగనన్న కాలనీల నిర్మాణ పనుల పురోగతిపై హౌసింగ్ విభాగం, విద్యుత్తు,, ఇరిగేషన్, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి -కందుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఐఎస్‌రావు నగర్‌లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. జెసిఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, రాం మూర్తి ఆర్ ఐ చంద్రశేఖర్ సచివాలయం కన్వీనర్లు రావులకొల్లు బ్రహ్మానందం, బక్కమంతుల అశోక్,జాజుల సాయి లక్ష్మి, బి సి సెల్ జిల్లా ప్రెసిడెంట్ జాజుల కోటేశ్వరరావు వైసిపి నాయ కులు కోడూరు వసంతరావు గణేషం గంగిరెడ్డి ఏకాంబరం విశ్వనాథ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడు :మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామ సచివాలయం 2 పరిధిలో మంగళవారం నాడు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సచివాలయం కార్యదర్శి అజయ్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ ఎల్ చెంచమ్మ, తహశీల్దార్ ఆర్ బ్రహ్మయ్య పాల్గొని మాట్లాడారు. మండల స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సర్పంచి మాణికుల నాగలక్ష్మి ,సయ్యద్ ఫైజుని ఉన్నారు.

తోటపల్లిగూడూరు :అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వైసిపి సీనియర్ నాయకులు కోడూరు దిలీప్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలం లోని కోడూరు బి ట్-సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపిడిఒ కన్నం హేమలత, తహశీల్దార్ హమీద్ ల పర్యవేక్షణ లో జరిగిన ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్ రెడ్డి ముఖ్య అ తిథిగా పాల్గొన్నారు. జెడ్పిటిసి శేషమ్మ, ఎం పిటీసీ శ్రీనివాసులు ఉన్నారు.

నెల్లూరు నగర నియోజకవర్గం పరిధిలోని 11, 54 వ డివిజన్లలోని వెంగమాంబ 1, 2 వీదులు, నిర్మల నగర్, లంగర్ తోట, జనార్ధన్ రెడ్డి కాలనీ సెంటర్ ,రూరల్ నియోజకవర్గం పరిధిలోని 23, 35 వ డివిజన్లలోని రాజు వారి వీధి, పోలేరమ్మ చెట్టు 1 , 2 వీదులు, ఇందిరమ్మ కాలనీ, లేక్ వ్యూ కాలనీ, బషీర్ నగర్ , రాజీవ్ గహకల్ప ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. కమిషనర్ వికాస్ మర్మత్, విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, ఎడిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అదనపు కమిషనర్ శర్మద ఉన్నారు., వైసిపి నాయకులు ఉన్నారు.

కందుకూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి

'విద్యా దీవెన' బకాయిలు చెల్లించండి

పొదలకూరు :విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు కలగట్ల సందీప్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలకు వెళ్లి బంద్‌కు సహకారం అందించాలని కోరారు. సందీప్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే నియమించాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన, కుక్, అటెండర్, వాచ్మెన్ తదితర పోస్టులన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పురస్కారాలు

నెల్లూరు : నెల్లూరు మూలపేట పరిసరాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీఅన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతి సమాజం ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభ పురస్కారాలను అందజేశారు. రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ ప్రతిభను కనపరిచిన విద్యార్థులను ప్రోత్స హించేందుకు సరస్వతి సమాజం కషి చేయడం అభినందనీయమని అన్నారు. సరస్వతి సమాజం నిర్వహకులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులను అందజేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సత్కరించారు. సరస్వతి సమాజం అధ్యక్షులు మోపూరు పెంచలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి టి రమణయ్య, ఈ.ఎస్.ఆర్.ఎం హై స్కూల్, ప్రభుత్వ బాలికల హై స్కూల్, వేద సంస్కత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ ప్రసాద్, వేదమూర్తి, లావణ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం ప్రమాదకరం

రాష్ట్ర ప్రజారోగ్య వేదిక అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణయ్య

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ నెంబరు 108 ప్రకారం నూతనంగా రాష్ట్రంలో నిర్మించబోతున్న మెడికల్ కళాశాలల్లో 'సెల్ఫ్ ఫైనాన్స్' పేరుతో విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయాలని పేర్కొనడం సరికాదని ఎపి ప్రజారోగ్యవేదిక ఆక్షేపించింది. ఈ మేరకు ఆ వేదిక అధ్యక్షులు డాక్టర్ ఎం.వి.రమణయ్య ఓ ప్రకటన విడుదల చేశారు. 5 కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నట్లు, మరో 12 మెడికల్ కాలేజీల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పడం అభినందనీయమన్నారు. అయితే ఆ కళాశాలల స్థాపన నిస్సందేహంగా ప్రజల ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను మెరుగుపరచడంలో కీలక భూమికను పోషించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను అనుసరించి కొత్తగా నిర్మించబోతున్న మెడికల్ కాలేజీలలో వసూలు చేయబోతున్న సెల్ఫ్ ఫైనాన్స్ విధానం చాలా ప్రమాదకరమన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రజాధనంతో స్థాపించబడినప్పటికీ, భవిష్యత్తులో ఈ ప్రభుత్వ నిర్వహణలోని వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. వైద్య విద్యను మెరుగుపరిచే ఏ కార్యక్రమాలకైనా మద్దతు ఇవ్వడానికి తాము సిద్ధమని, రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ రంగం అభివద్ధికి సానుకూల స్పందన, సహకార ప్రయత్నాల కోసం ప్రజారోగ్య వేదిక ఎదురు చూస్తుందన్నారు.

ఎంవి రమణయ్య

హనుమంతు హత్య కేసులో మలుపు

డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి -గుడ్లూరు :మండలంలోని పాజర్లలో పాటి హనుమంతు హత్య జరిగి రెండు నెలలు కావస్తున్నా ఆ కేసు ఒకొలిక్కి రాలేదు. మృతుడి భార్య నాగమ్మ తన ముగ్గురు కుమార్తెలతో కలిసి హత్యతో సంబంధం ఉన్న వారందరినీ అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టాలని గుడ్లూరు పిఎస్‌లో బైఠాయించి ధర్నా చేయడంతో దిగొచ్చిన పోలీసులు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత మహిళలు శాంతించారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో కేసు మలుపులు తిరిగి బాధితులు పైనే కేసు నమోదు చేయడానికి రంగం సిద్ధమైంది. దీనిపై సమీక్షించేందుకు కందుకూరు డిఎస్‌పి రామచంద్ర మంగళవారం గుడ్లూరు చేరుకుని విచారణ చేపట్టారు.

రెండు నెలల కిందట మద్యం సేవించేందుకు పాజర్ల – -పొట్లూరు మధ్య ఉన్న రిజర్వు ఫారెస్టు భూమిలో జామాయిల్ చెట్ల దగ్గర కి హనుమంతు చేరుకున్నాడు. పాజర్లకు చెందిన హనుమంతు, మహేష్ ఘర్షణ పడ్డారు. తెల్లవారు జామున కొందరు మృతదేహం ఉన్నట్లు పోలీసులకి సమాచారం పంపడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. మృతుడు హనుమంతుగా గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో హత్యగా భావించి వారి బంధువులకి సమాచారం తెలిపారు. అతడి భార్య పిల్లలు బంధువులు శవాన్ని తీసుకెళ్లి మహేష్ ఇంటి దగ్గర పెట్టి ఆందోళనకి దిగారు. గ్రామస్తులందరూ అక్కడికి చేరుకున్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో నిందితుడుగా భావిస్తున్న మహేష్‌ని అరెస్టు చేసి తమదైన పద్ధతిలో విచారణ చేపట్ట డంతో మద్యం మత్తులో రాయితో కొట్టి చంపినట్లు మహేష్ ఒప్పుకోవడంతో అతనిపై కేసు నమోదు చేసి కందు కూరు కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నిందితు డికి 14 రోజులు రిమాండ్ విధించింది. మిగతా వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టాలని బాధిత మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ధర్నా చేపట్టారు. బాధితులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. అనంతరం పాజర్ల గ్రామంలో పెద్దల సమక్షంలో బాధిత కుటుంబానికి 90 సెంట్లు పొలం ఇప్పిస్తా మని నచ్చచెప్పడంతో బాధితులు మెత్తబడ్డారని చెబుతున్నారు. తాజాగా బాది తులపై కేసు నమోదు చేయాలని మరో వర్గం వారు స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేయ డంతో కేసు కొత్త మలుపులు తిరిగింది. దీంతో కందుకూరు డిఎస్‌పి రామ చంద్ర విచారణ చేపట్టడంతో దీనిపై ఉత్కంఠ నెలకొంది.

ఇఫ్కో నానో లిక్విడ్ ప్రయోజనాలు ఏమిటీ

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :ఇఫ్కో అబివృద్ధి చేసిన నానో యూరియా 500 ఎంఎల్ లిక్విడ్ నానో యూరియా 40 కిలోల యూరియాతో సమానమా ప్రయోజనాలు ఏమిటని రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఆయన మంగళవారం పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఘన యూరియా కంటే చాలా చౌకగా ప్రభావవంతంగా ఉంటుందనే విషయం వాస్తవమేనా. దాని వివరాలు దేశంలో ఘన యూరియాను నానో యూరియాతో భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్న విధానం. దేశంలో యూరియా డిమాండ్, సరఫరా వివరాలు దేశంలో ఇప్పటివరకు నానో యూరియా వినియో గానికి సంబంధించిన వివరాలు తెలుపమని ప్రశ్నించారు. అందుకుగాను స్పందించిన కేంద్రమంత్రి భగవంత్ ఖుబా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్), ఇఫ్కో నానో-యూరియా ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి, ఎంపిక చేసిన 20 స్థానాల్లో, ఎంచుకున్న పంటలలో ఫోలియర్ (ద్రవ) స్ప్రేగా ఉపయోగించేందుకు ట్రయల్స్ నిర్వహించినట్లు తెలిపారు. సాంప్రదాయ యూరియాకు బదులుగా నానో-యూరియాను టాప్-డ్రెస్సింగ్ కోసం ఫోలియర్ స్ప్రేగా ఉపయోగించవచ్చని ఈ అధ్యయనం ద్వారా సూచించ బడిందన్నారు.



బిసి సదస్సుకు తరలిరండి : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఈనెల 27వ తేదీ గురువారం సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఒంగోలులో గుంటూరు రోడ్ లోని ఎ1 ఫంక్షన్ హాలు సమీపంలోని విడిది కేంద్రంలో జయహో బిసి సభ జరగనుంది. ఈ నేపథ్యంలో కందు కూరు నియోజ కవర్గంలోని అన్ని మండలాల బిసి నాయకులతో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు మంగళ వారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీసీ సోదర సోదరీమణులు సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జినిగర్ల నాగరాజు, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి

వైసిపి ఆరోపణలు సరికాదు : టిడిపి

ప్రజాశక్తి -పొదలకూరు : గతంలో జరిగిన ఎన్నికల్లో ఎప్పుడు పొదలకూరు పంచాయతీలో వైసిపికి మెజారిటీ రాలేదని, కానీ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి మాత్రం స్థాయిని మించి మాట్లాడుతున్నారని టిడిపి మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం పట్టణ వైసిపి నాయకులు ప్రెస్ మీట్ పెట్టి, మంత్రి పంపిన స్క్రిప్ట్ ను చదివారన్నారు. తమ నాయకుడు అవినీతి కి పాల్పడలేదని తమ నాయకుడి తరఫున తానుకాళహస్తిలో ప్రమాణానికి సిద్ధమని తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ టిడిపి అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, పల్లారపు కష్ణ. కండే సురేష్ యాదవ్, పి వెంకటరత్నం నాయుడు, శ్రీనివాసులు ఉన్నారు.

పాడి రైతులకు న్యాయం చేయండి..!

పొదలకూరు :మండలంలో మినీ గోకులం నిర్మించుకుని, ఇప్పటివరకు ఆ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న పాడి రైతులకు న్యాయం చేయాలని మండల టిడిపి నాయకులు, మినీ గోకులం బాధిత పాడి రైతులు కలిసి మంగళవారం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. నాగమణిని కోరారు. మండలంలోని నావూరు, నావురుపల్లి గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన వారికే బిల్లులు పడ్డాయని,టిడిపి సానుభూతి పరులకు బిల్లులు పడక పోవడంతో మినీ గోకులం నిర్మించిన రైతులు 1902 నెంబర్ కి (జగనన్నకి చెబుదాం)లో ఫిర్యాదు చేశారు. విచారణ నిమిత్తం పశువైద్యశాలకు విచ్చేసిన డిప్యూటీ డైరెక్టర్ ను పాడి రైతులు ,టిడిపి నాయకులు కలిసి తమ గోడును వెలబుచ్చు కున్నారు. టిడిపికి సానుభూతిపరులుగా ఉన్న వారికి పదిమందికి బిల్లులు పడలేదని కాళ్ల అడిగేలా అధికారులు చుట్టూ తిరుగుతున్న పట్టించుకోలేదని వాపోయారు. ఏడీలు కే.అరుణ, సురేష్, నోడల్ అధికారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షులు తలచిరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షులు మల్లికార్జున్ నాయుడు టిడిపి నాయకులు కోవూరు వెంకటేశ్వర్లు ఉన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన విద్య రాణించే విధంగా చూడాలని జిల్లా ప్రభుత్వ పాఠశాలల పుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పేరారెడ్డిపల్లి జెడ్‌పి పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు సోమవరపు భాస్కర్ రెడ్డికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కేతా వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

నేడు 'డయల్ యువర్ డిఎం'

ప్రజాశక్తి-కావలి : కావలి ఆర్‌టిసి డిపోలో బుధవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు "డయల్ యువర్ డియం" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. కావున ప్రజలు, ప్రయాణికులు 9959225643 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అమూల్యమైన సలహాలు ఇచ్చి, మెరుగైన సేవలందించడానికి సహకరించాలన్నారు.

వ్యక్తిగత విమర్శలు తగవు

ప్రజాశక్తి- కావలి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ బహిరంగ సభలలో జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ని వ్యక్తిగతంగా మాట్లాడడమే కాకుండా, తన సహచరులతో తిట్టించడం జగన్‌కే చెల్లిందని జనసేన జిల్లా కార్యదర్శి సమ్మును వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సబ్జెక్టుపైన అవగాహన లేని, సంపదే పరమావధిగా, ఒక క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ కలిగిన వ్యక్తి, ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమన్నారు.

'ఉపాధి' పనులపై బహిరంగ విచారణ

ప్రజాశక్తి-కొండాపురం : ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద బహిరంగ విచారణ చేపట్టారు. 19 పంచాయతీలలో సుమారు 468 వర్కులకు సంబంధించి 1-4 -2022 నుండి 31-3-2023 వరకు జరిగిన పనుల మీద విచారణ నిర్వహించారు. జూలై 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు విచారణ జరిగింది. క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, అంబుడ్స్‌మేన్ వెంకటరెడ్డి, డిఎఒ సురేష్, క్లస్టర్ ఎపిడిఒ గాయత్రీ దేవి, ఎపిఒ చెన్నయ్య, ఎఇ వెంకట సాయి, ఎస్ఆర్‌పి వెంగయ్య పాల్గొన్నారు.

సంజీవని ఆరోగ్య రథం సేవలు

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని కృష్ణారెడ్డిపాలెంలో 65వ రోజు "సంజీవని ఆరోగ్య రథం" అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటుగా ఉచితంగా మందులు పంపిణీతో కూడిన వైద్య సేవలందించారు. 130 మంది గ్రామస్తులు డాక్టర్‌ను వివిధ ఆరోగ్య సమస్యలతో సంప్రదించారు. 98మంది కంటి చూపు సమస్యలకు చికిత్స తీసుకున్నారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 88వ రోజు "అన్న క్యాంటీన్" ద్వారా 630 మంది తమ ఆకలిని తీర్చుకొన్నారు. దబ్బగుంట బుజ్జయ్య, గంగపట్ల కొండయ్య మాజీ సర్పంచ్, సొలసా రవి, తోకల కొండారెడ్డి, శ్రీధర్, పుల్లయ్య, తోకల అంకయ్య, తోకల మహేంద్ర, పెండెం కొండలరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొదుపు సిబ్బందికి సూచనలు

ప్రజాశక్తి-సంగం : స్థానిక వెలుగు కార్యాలయంలో ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ పాలసీపై మంగళవారం జరుగుతున్న ట్రైనింగ్ కార్యక్రమాన్ని డిఆర్‌డిఎ పీడీ సాంబశివారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పొదుపు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పొదుపు సంఘంలో ఆర్థికపరమైన కార్యకలాపాలు సజావుగా జరిగేందుకు ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

వాహనాలు సీజ్

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : పెన్నా పొర్లుకట్ట పరివాహక ప్రాంతం నుంచి గంగపట్నం గ్రామంలోని ఓ ప్రయివేట్ లేఅవుట్‌కు అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను, ఒక జెసిబిని మంగళవారం గనుల, భూగర్భ శాఖ డిఎంజిఒ ఎ.శ్రీనివాస్‌కుమార్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ స్క్వాడ్ ఎడి బాలాజీ నాయక్ ఆదేశాలతో మైనింగ్ శాఖ అధికారులు వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను ఇందుకూరుపేట పోలీసులకు అప్పగించారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : జగనన్న మనబడి నాడు-నేడు పనులను ఎంఇఒ-1 షేక్.మస్తాన్ వలీ పరిశీలించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నార్త్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలో జరుగుతున్న పనులను విద్యార్థుల పఠన అభ్యసన నైపుణ్య సామర్థ్యాలను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన వస్తువుల విషయంలోనూ నాణ్యతగా పనులు జరిపించడంలోనూ ఎటువంటి రాజీలేకుండా పనులు త్వరగా జరిగేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాఫర్‌మోహిద్దీన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యత పెంచాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యత పెంచాలని సిడిపిఒ శారద పేర్కొన్నారు. మంగళవారం బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎఎన్ఎంలు, మహిళా పోలీసులతో సిడిపిఒ శారద సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ వెంకటసుబ్బారావు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రతిఒక్కరికీ అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కోటేశ్వరి, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన బంద్

ప్రజాశక్తి-ఉదయగిరి : బిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసినట్లు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జల్సా యాదవ్, నవీన్, కొండలరావు, రామ్మోహన్, సుహేల్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరురూరల్ : విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వైసిపి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వారు డిమాండ్లతో బిఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో బిఎస్ఎస్ఎఫ్ నాయకులు వ్యవస్థల మారతి నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో కళాశాలల్లో బంద్ చేపట్టారు. కార్యక్రమంలో బిఎస్ఎస్ఎఫ్ ఆత్మకూరు నియోజకవర్గం నాయకులు సుభాని, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలంచర్లలో 'మహాశక్తి టీం'

ప్రజాశక్తి-కావలిరూరల్ : కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశాల మేరకు మహాశక్తి టీమ్ కార్యక్రమం చలంచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దవరం, హరిజనవాడ, అరుంధతీయవాడ, తదితర ప్రాంతాలలో పర్యటించారు. మహిళలు గ్రామంలోని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం వారు మహిళలతో రామాలయం గుడి వద్ద రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మహిళా పట్టణ అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, మహిళలు కొల్లూరు అశ్విని, పసుపులేటి పద్మ, రాజమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జి గుర్రం సునీల్ కుమార్, చలంచర్ల గ్రామ కమిటీ అధ్యక్షులు గుర్రం మానస, మాజీ సర్పంచ్ చాగంటి వెంకటేశ్వర్లు, మనోహర్, శిద్దా మాలకొండయ్య, వినోద్, దేగ లింగయ్య, గుర్రం కొండయ్య, పావన బోయిన బుజ్జియ, హజరత్, మల్లికార్జున, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే మత్స్యకారులకు మేలు

ప్రజాశక్తి-కావలి : మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత టిడిపి దేనని తెలుగుదేశం నేత, ఆప్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు పాలిశెట్టి రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా మత్స్యకార విభాగ అధ్యక్షులు పామంజి శేషయ్య, రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి మెంబర్ సోమయ్యగారి రమణ, వాయిళ్ల మస్తాన్, కుర్ర కొండయ్య, యల్లంగారి తాతయ్య, వాయల తిరుపతి, మామిడి వెంకటసుబ్బయ్య, పామంజి గోవిందయ్య, అప్పాడి తిరుపతిరెడ్డి, ఆవుల యాకోబు, వాయిళ్ల కనకయ్య, యల్లంగారి ప్రసాద్, వాయిళ్ల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కమిషన్ చైర్మన్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలిగిరి : ఎపి ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన టిడిపి ఎస్‌సిసెల్ నాయకులు సన్నద్ద కొండయ్య, గంగపట్ల హజరత్తయ్య కలిశారు. పలు సమస్యల మీద కమిషన్ చైర్మన్‌తో చర్చించినట్లు తెలిపారు. కమిషనర్ చైర్మన్ కూడా సానుకూలంగా స్పందించి జిల్లా అధికారులతో చర్చించిన సమస్యలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

త్వరలో బకాయిలను చెల్లిస్తాం..

ప్రజాశక్తి-కోవూరు : సిబ్బందికి ఉన్న బకాయిలను అతిత్వరలోనే రాబోయే ఏడాది గడువు లోపు పూర్తిగా చెల్లిస్తామని ఆప్కోస్ డైరెక్టర్ రాజారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం పడుగుపాడు ఆప్కోస్ జోనల్ వర్క్ షాప్‌ను ఆయన సందర్శించారు. వర్క్ షాప్ మేనేజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వర్క్స్ మేనేజర్ మురళి బాబు, షేక్ షమీమ్ పాల్గొన్నారు.

మణిపూర్ అకృత్యాలపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-కావలి

మణిపూర్‌లో మహిళలపై జరిగిన అకృత్యాలపై విచారణ జరిపించి, నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో డిఎఒ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో గత 6 నెలలుగా ఒకే కులానికి చెందిన మహిళలపై, పురుషులపై అనేక దురాగతాలు, అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. గత 3 నెలల క్రితం ఒకే జాతికి చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారాలు చేసి, హత్యలు చేశారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే ఈ దురాగతాలన్నీ జరిగాయన్నారు. ఈ ఘటనలను నివారించేందుకు తక్షణం కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మైనార్టీ జాతీయులైన 'కుకీలకు' రక్షణ కల్పించాలని సిపిఎంగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు గడ్డం విజయలక్ష్మి, వ్య.కా.సం. నాయకులు మారుపూడి రాధాకృష్ణ, పెముల సీతా రామయ్య, సిపిఎం నాయకులు కె.జాన్, షేక్.అమీర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మణిపూర్ ఇద్దరు మహిళలు నగ్నంగా ఊరేగించిన సంఘటన అమానవీయమని కుల వివక్షత పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఆత్మకూరు నాగయ్య అన్నారు. మంగళవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆత్మకూరు పురపాలక పరిధిలోని వెంకటరావుపల్లి గిరిజన కాలనీలో గిరిజన మహిళలతో కలిసి పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ప్రపంచంలోని మానవాళి సిగ్గుపడేలా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దారుణ

నిరసన వ్యక్తం చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

మారణకాండకు నిరసనగా మణిపూర్ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సభ్యసమాజం సిగ్గు పడేలా ప్రపంచం ముందు భారతదేశం తలదించుకునేలా ఈ సంఘటన చాలా బాధాకరమని తెలిపారు. ఇద్దరు మహిళలను వివస్త్రలుగా చేసి వారిపై అత్యాచారం చేసి వారి బంధువులను చంపి అక్కడ పైశాచిక ఆనందం పడుతున్న అల్లరి మూకలను వారికి మద్దతు పలుకుతున్న బిజెపి నేతలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం ఘర్షణలను రాష్ట్రం నియంత్రించలేనప్పుడు ప్రధాని మౌనంగా ఎందుకు ఉన్నాడని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటయ్య, మండల కార్యదర్శి పెంచలయ్య, తదితరులు వెంకట్రావుపల్లి, గిరిజన కాలనీవాసులు హాజరయ్యారు.

భూ హక్కు కల్పించండి సారూ..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మర్రిపాడు మండలం ఇసుకపల్లి గ్రామస్తులు, ఆత్మకూరు సిపిఎం నాయకులతో కలిసి తమ ఆధీనంలో ఉన్న భూమికి భూ హక్కు కల్పించాలని మంగళవారం ఆర్‌డిఒ కరుణ కుమారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఎం నాయకులు గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ ఇసుకపల్లి గ్రామానికి చెందిన పేదలైన సుమారు 30 కుటుంబాలు ఒక్కొక్కరు మూడు ఎకరాలు లోపు గత 20 సంవత్సరాలు నుంచి సాగు చేసుకుంటూ ఉంటే, ప్రభుత్వం భూమిని రీ సర్వేతో భూస్వాములకు పట్టాలు మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేసుకునే పొలాలను పంచాయతీలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన కొంతమంది గతంలో ఎప్పుడూ తమ పొలాల్లోకి రానివారు ఇప్పుడు వచ్చి తమకు 2012లో పట్టాలు ఇచ్చారని దౌర్జన్యంగా తమపైకి వచ్చి గొడవ చేస్తున్నారన్నారు. గతంలో మర్రిపాడు తహశీల్దార్‌కు పట్టాలు మంజూరు చేయాలని అనేకసార్లు వినతులు అందజేశామని తెలిపారు. అయినా అధికారులు పట్టాల మంజూరు చేయలేదని వాపోయారు. ఈ భూముల విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన విచారించి చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒకు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ క్రమంలో తాము ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణ కుమారిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఇసుకపల్లిలో రీ సర్వే అధికారులు గ్రామానికి వచ్చి ఎవరి పేరు మీద పొజిషన్ సర్టిఫికెట్ ఉందనేది చూడకుండా భూస్వాములకు పట్టాలు ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. కలెక్టర్‌ను కలవడంతో బాధితులకు అనుకూలంగా అధికారులు పరిశీలించి ఫార్వర్డ్ చేశారని తెలిపారు. ఆర్‌డిఒ, తహశీల్దార్‌ను కలిస్తే సమస్య పరిష్కారం అతుందని తెలిపారు. ఎక్కడా లేని విధంగా మర్రిపాడులో కుంభకోణాలు జరుగుతున్నాయన్నారు. బాధితులు చిన్న తిరుపాలు, నరసింహులు, జయమ్మ, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి ఎల్.కృష్ణ ప్రసాద్ తదితరులున్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' అమలుపై పరిశీలన

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో ఇంటి వైద్య సేవ, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు తీరును జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ పరిశీలించారు. మంగళవారం జలదంకి మండలంలోని ఆదిరెడ్డిపాలెం, జూచెట్టుపాలెంలలో కలెక్టర్ పర్యటించారు. గ్రామ నాయకులు వంటేరు లక్ష్మీనరసారెడ్డి ఆక్రమణ హై స్కూల్ స్థలం ఆక్రమణ తొలగించాలంటూ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను, తహశీల్దారులను ఆదేశించారు. బ్రాహ్మణక్రాక పంచాయతీ పరిధిలోని జూచెట్టుపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణక్రాక, చామదల జూచెట్టుపాలెం ప్రజలు అనేక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలించామని, ఈ విధానం వల్ల హాస్పిటల్‌కి రాలేని వారికి ఇంటి వద్దనే పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిన్నారులలో రక్తహీనత లేకుండా చూడాలనే ఉద్దేశంతోనే అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టిక ఆహారం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. జూచెట్టుపాలెం కాలనీవాసులు మౌలిక వసతులు సరిగ్గా లేవంటూ, పాలకులు పట్టించుకోవడం లేదంటూ, న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. అంతా వర్షంలోనే కాలనీలోకి నడుచుకుంటూ వెళ్లిన కలెక్టర్ శ్మశాన వాటిక, డ్రెయినేజీలను, రోడ్లను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ రజిత, కావలి ఆర్‌డిఒ శీనానాయక్, డిఎల్‌డిఒ కనకదుర్గ భవాని, ఎంపిడిఒ శ్రీధర్ బాబు, డాక్టర్ భవ్య, తహశీల్దార్ పద్మావతి, సిడిపిఒ పద్మజ, వ్యవసాయ అధికారిని శైలజ, హౌసింగ్ ఎఇ ప్రసాద్, ఎపిఎం శ్రీధర్ రావు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ సతీష్ బాబు, పిఆర్ఎఇ వై.వాణి, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాత్రి సమయాల్లోనూ వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని ప్రజలకు రాత్రి సమయాల్లో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ డాక్టర్లు నియమించాలని కలెక్టర్ హరినారాయణకు జై భీమ్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చుట్టుపక్కల గ్రామంలో హాస్పిటల్ లేవు రాత్రి వేళల్లో ఆరోగ్యం బాగా లేకపోయినా పాము, తేలు కరిచిన అత్యవసర సేవల కోసం కావలి, నెల్లూరు దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుందన్నారు. ఆ సమయాల్లో వాహనాలు దొరక ప్రజలు చనిపోయిన ఘటన కూడా ఉన్నాయని, ప్రభుత్వ వైద్య శిబిరం కోవూరుపల్లిలో ఉన్న రాత్రి సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. బోగోలు మండల ప్రజల కోసం జిల్లా ఉన్నత అధికారి డాక్టర్ నియమిస్తే ప్రజల ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు.

జూనియర్ కళాశాలలో కలెక్టర్ సందర్శన

ప్రజాశక్తి-కావలి

స్థానిక 16వ వార్డులోని ముసునూరు కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కళాశాలలోని తరగతి గదులు, స్టోర్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించి, పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నసురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ పిలుపునిచ్చారు. ఉదయం కావలి మండల

మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

పరిధిలోని సర్వాయపాలెంలో జగనన్న సురక్ష శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సర్టిఫికెట్ల వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డిఒ వి.కె.శీనా నాయక్, తహశీల్దారు మాధవ రెడ్డి, ఎంఇఒలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, జిసిడిఒ టి.మమత, హెచ్ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలంలోని రెవెన్యూ శాఖలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం తహశీల్దార్ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బోగోలు మండల పరిధిలో జక్కేపల్లి గూడూరు, ముంగమూరు గ్రామాల్లో పక్కాగా రీ సర్వే జరుగుతుందన్నారు. జిల్లాలో 118 గ్రామాల్లో మొదటి విడత రీసర్వే పూర్తయిందని, రెండో విడతగా 110 గ్రామాలను ఎంపిక చేయగా, 37 గ్రామాల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలోని సుమారు 700 లకు పైగా గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఎం.హరినారాయణ మంగళవారం తనిఖీ చేశారు.

డాక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు డాక్టర్లను ప్రభుత్వం నియమించిందని, 45 రకాల పరీక్షలు చేస్తూ, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శీనానాయక్, తహశీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ బ్రిజిత, పిహెచ్‌సి వైద్యులు సీమా తప్సట్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-బిట్రగుంట (అల్లూరు)

జిల్లాలో నాడు-నేడు రెండో విడత పనులను త్వరితగతన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అల్లూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను కలెక్టర్ ఎం హరి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో మొదలైన నాడు-నేడు రెండో విడత పనులు వర్షాల కారణంగా కాస్త జాప్యం జరిగిందని, త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అల్లూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని గైనకాలజీ, సర్జికల్, వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్‌వెంట ఆర్‌డిఒ శీనా నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కట్టా వెంకటేశ్వర్లు, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్రీదేవి, వైద్యులు ఉన్నారు.

పాఠశాలలో ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ సందర్శన

ప్రజాశక్తి-మర్రిపాడు

రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి మంగళవారం నందవరం మోడల్ స్కూల్‌లో సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ, పాఠ్యపుస్తకాల పంపిణీ వివరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నించి వారిలో సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ఇంటి వద్దకే 11 ఉచిత సేవలు

ప్రజాశక్తి-ఉదయగిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో ఇంటి వద్దకే 11 ఉచిత సర్వీసులు వలంటీర్లతో వైసిపి ప్రభుత్వం అందిస్తుందని జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బిట్-2 సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని మన రాష్ట్రాన్ని చూసి పొరుగు రాష్ట్రాలు ఈ తరహా కార్యక్రమాలు అమలు చేయాలని భావిస్తున్నారన్నారు. సచివాలయం సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి లబ్ధిదారులకు అవసరమైన పనులను వాలంటీర్ల రూపంలో లబ్ధిదారుల ఇంటికే నేరుగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకొని పూర్తి సంక్షేమ రాష్ట్రంగా పేదరిక రహిత రాష్ట్రంగా మార్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ్రాజ్యం జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, తహశీల్దార్ జగదీష్ బాబు, ఎంపిడిఒ మల్లికార్జునరావు, పంచాయతీ సెక్రటరీ నరసయ్య, ఉపసర్పంచ్ ముత్తుజ, ఎంపిటిసి పెద్ద మస్తాని వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఎస్థాని, మాజీ ఎంపిటిసి ఉప్పుటూరి హరి, మాజీ సర్పంచ్ అక్కుల్ రెడ్డి, వైసిపి నాయకులు రియాజ్, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మర్రిపాడు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఇన్‌ఛార్జి తహశీల్దారు ఆనందరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మస్తాన్‌ఖాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి మాట్లాడుతూ అర్హులై ఉండి సరైన సర్టిఫికెట్లు లేని వారికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. తద్వారా వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు వారికి అవసరమైన సర్టిఫికెట్లను సర్వీస్ ఛార్జ్ లేకుండా ఉచితంగా లబ్ధిదారులకు అందజే శారు. కుల, మత వర్గ పార్టీలకతీతంగా వివక్షకు తావు లేకుండా సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, స్థానిక సర్పంచ్ షేక్ బీబీజాన్, ఎంపిటిసి గీత, వైసిపి మాజీ కన్వీనర్ శ్రీనివాసులునాయుడు, ఏపిలికుంట ఎంపిటిసి హాజరత్ రెడ్డి, పెగళ్లపాడు సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్, రామానాయుడుపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు, పొంగూరు వైసిపి నాయకులు శ్రీనివాసులురెడ్డి, జనార్ధన్, సచివాలయ కన్వీనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, నాయకులు కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధి, సంక్షేమమే సిఎం లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆదరించాలని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వాసిలి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెలికా రమా, స్థానిక వైసిపి నాయకులు గిరినాయుడు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ అన్ని సంక్షేమ ఫలాలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలియజేశారు. ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలకు అత్యంత ఉపయోగకర మైన 11 రకాలైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను, సర్టిఫికెట్లను అందించ డమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళ వారం కొత్తూరు సచివాలయం-2 పరిధిలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. హక్కులకు పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి సంక్షేమ పథకాలను అందించేందుకు జగనన్న సురక్ష పేరుతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి, తహశీల్దార్ సుబ్బయ్య, ఎంపిడిఒ నాగేంద్ర బాబు, ఎపిఎం రవిశంకర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్లు వెంకురెడ్డి, తిరుపతి, రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని మినగల్లు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని డిప్యూటీ తహశీల్దారు ప్రదీప్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవం తంగా జరుగుతుంద న్నారు. జగనన్న సురక్ష శిబిరాల్లో ఎటువంటి ఛార్జీలు వసూలు చేయకుండా 11రకాలైన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించామ న్నారు. మినగల్లు సచివాలయ పరిధిలోని గ్రామాలలోని లబ్ధిదారులకు 625 సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కుల, మత వర్గ పార్టీలకతీతంగా వివక్షకు తావు లేకుండా సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మధుసూదన్ రావు, వ్యవసాయ సహకార సంఘం మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ అంకిరెడ్డి, సర్పంచ్ పెంచలయ్య, మధు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో పేదలందరికీ లబ్ధి

ప్రజాశక్తి-వరికుంటపాడు

జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలందరికీ లబ్ధి చేకూరుతుందని తహశీల్దారు సయ్యద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మండలంలోని వేంపాడు పంచాయతీలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిపి గవదకట్ల వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందని, ఎక్కడైనా కొన్ని సాంకేతిక కారణాలతో కొంతమంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందలేదనే వారికి కూడా ఈ పథకం ద్వారా పూర్తిస్థాయిలో లబ్ధి చేయగలిగామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా లబ్ధిదారులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ వేణుగోపాల్, సర్పంచ్ తాతపుడి విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి డేగ శ్రీను, పలువురు సర్పంచులు, నాయకుల, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

In the Court of the IIIrd Addl. Junior Civil judge (Excise Court): Ananthapuramu

O.S.No:76/2022

Between:

Challa Rajendra Prasad ...Plaintiff

And

J.Sunil Babu & another ...Defendants

NOTICE TO DEFENDANT NO.1

D1:J.Sunil Babu H/o Late Smt.E.Aruna S/o J.Prasad Rao R/at D.No.9-4-7, Sri Potti Sreeramulu Street, Sullurupeta, SPS Nellore Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 01-08-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

జి.రాఘవేంద్ర, అడ్వకేట్
అనంతపురం, సెల్: 9885556351.

In The Court of the III Addl. District Judge : Nellore

E.P.No. 325 / 2018

Arbitration No. 172 / 2016

M/s. Shriram City Union Finance Ltd Rep.by its GPA Holder/Authorized Signatory, S V Subbaiah - Award - Holder

Vs

1. **Sk. Ismail** and 2 others - J.D.Rs

Notice

To,
JDR-1.**Shaik Ismail,** S/o **Sk. Ibrahim,** resident of D.No.9/8, Iragalamma Sangam, Mulapeta, Nellore City, SPSR Nellore District.

పై నెంబరున అవార్డు హోల్డర్ 1వ జె.డి.ఆర్. తాలూకు జప్తు కాబడిన స్థిరాస్తిని వేలంకు కోరినందున సదరు ఇ.పి.లో మీకు సేల్ నోటీసు (ఆర్డర్ 21,రూల్ 66) నిమిత్తం **తే03-08-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పేరేపి వేణుగోపాల్, బి.కాం., బి.ఎల్.,
అవార్డు హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In The Court of The 1st Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 150 / 2019

M/s. Corporation Bank, Nellore Branch Rep.by its Chief Manager, Brindavanam, Nellore, SPSR Nellore Dist. - Plaintiff

Vs

Sri Ramalakshi Textiles Rep.by its Proprietor, Kandala Venkateswarlu - Defendant

Notice to Defendant

Sri Ramalakshmi Textiles, Rep.by its Proprietor Kandala Venkateswarlu, Residing at 1st Floor, New Building Putta Veedi Near Cattleshed, Near Dargha Veedhi, Nellore City, SPSR Nellore Dist.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో బ్యాంక్‌లోన్ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తేది: 25-8-2023** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥ లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామిశెట్టి సుభాషిణి, M.A., L.L.M., P.hd
వాది తరపు న్యాయవాది, నెల్లూరు.